

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు



సంపుటి : 31 | సంచిక : 12 | ఆగష్టు 2026


రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342


ఈ సంచికలో. . . .



శ్రీకృష్ణ లీలలు .................................... 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు....... 8

శ్రీమద్భగవద్గీత .................................. 14



**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం



భౌతిక సంపద ఎంత ఉన్నా
దైవీ సంపద లేకపోతే
దుఃఖం నుండి విడుదల
పొందలేదు.

# శ్రీకృష్ణ లీలలు



**(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణముల నుండి)**

ఈశ్వరుని అవతారాలలో ముఖ్యమైనది కృష్ణావతారం. ఆయన లీలలు కావాలంటే భాగవతం చదవాలి, ఆయన చెప్పిన సందేశం వినాలంటే భగవద్గీత అధ్యయనం చెయ్యాలి. భాగవతం దశమ స్కంధంలో కృష్ణుడి జననం, లీలలు, మధుర నివాసం, కంసుడి సంహారం, గోకులం, బృందావనం, కృష్ణుడి జీవిత విశేషాలు, భక్తుల కథలు అన్నీ వస్తాయి. “భారతంలాంటి లక్ష శ్లోకాల గ్రంథం రాసినా మనస్సుకి శాంతి దొరకలేదు” అని వ్యాసుడు అంటే నారదుడు “భారతంలో అన్నదమ్ముల పేచీలు, యుద్ధాలు, అసూయలు, ద్వేషాలు, అన్నీ లోకం గొడవలే అందుచేత భగవంతుడి ఔన్నత్యం, భగవంతుడి లీలలు, భగవంతుడి కథలు రాస్తే, నీకు మనస్సు చల్లబడి పరమశాంతి కలుగుతుంది” అని చెపితే అప్పుడు వ్యాసుడు భాగవతం రాశాడు.

కృష్ణుడు మహావిష్ణువు యొక్క అవతారం, శరీరంలో 120 సంవత్సరాలు ఉన్నాడు. ఆయన తల్లిగర్భం నుండి జన్మించలేదు. మధురలో కృష్ణుడు జన్మించిన స్థానంలో ఇక్కడ కృష్ణుడు పుట్టినవాడివలె కనిపించాడు అని రాసి ఉంటుంది. దేవకీదేవి అష్టమగర్భంలో పుట్టేవాడివల్ల తనకు ప్రమాదముందనే భయంతో, దేవకీవసుదేవులను చెరసాలలో పెట్టాడు కంసుడు. పుట్టిన పిల్లలనందరినీ చంపేస్తున్నాడు అని వాళ్లకి కంసుడంటే విపరీతమైన భయం వచ్చేసింది. కృష్ణుడు పుట్టిన వెంటనే వీడు మన బిడ్డ కాదు నారాయణుడు అని వసుదేవుడు గ్రహించాడు. ఆయన చతుర్భుజాలతోటి శంకుచక్రాలతోటి కనిపించాడు. ఓ గోవిందా, నారాయణుడా మా భయం పోగొట్టటానికి మా కుక్షిలో పుట్టావు నువ్వు, కంసుడంటే ఇంక భయపడము, అంటాడు వసుదేవుడు.

శ్రీకృష్ణుడు పుట్టినది అష్టమతిథి, అర్ధరాత్రి బాగా వర్షం కురుస్తోంది. గోకులంలో నందుడి ఇంట్లో యశోదకి పుట్టిన అమ్మాయి దుర్గావతారం. అమ్మాయి స్థానంలో తనని ఉంచి, ఆ అమ్మాయిని తీసుకురమ్మంటాడు వసుదేవుడితో. వరదలో ఉన్న యమునానది దారి ఇస్తుందని చెపుతాడు. నిద్రిస్తున యశోద పక్కలో కృష్ణుడిని పెట్టి అక్కడ ఆడపిల్లని తీసుకొచ్చి దేవకీదేవి పక్కన పెట్టాడు వసుదేవుడు. యశోద దేవకీ తమ పక్కనున్న పిల్లలు తమకు పుట్టినవాళ్లే అనుకున్నారు. ఇలా కృష్ణుడు ఎన్నో మాయలు చేశాడు. దేవకీదేవికి అష్టమగర్భం అమ్మాయి పుట్టిందని కంసుడికి తెలియపరిచారు. కంసుడు అంతకు ముందు పుట్టిన పిల్లలని చంపినట్టే ఈ అమ్మాయిని పైకి ఎగరువేసి కత్తితో నరకాలని చూశాడు. ఆ అమ్మాయి క్రిందకి రాకుండా పైకి వెళ్ళిపోయింది. నిన్ను చంపేవాడు అప్పుడే పుట్టాడు, గోకులంలో పెరుగుతున్నాడు అని పలికింది.

అప్పటినుండి కంసుడు గోకులంలో కొత్తగా పుట్టిన పిల్లలని చంపమని మొట్టమొదట రాక్షసి పూతనని పంపాడు. యశోదకి మగపిల్లవాడు పుట్టాడని తెలిసి, అందరినీ చంపటం ఎందుకు వాడికి పాలు ఇచ్చినట్టు ఇచ్చి చంపుదామని వచ్చింది. ఆవిడ స్తనమంతా విషం పూసుకొని కృష్ణుడిని ఎత్తుకొని తన స్తన్యం ఇచ్చింది. పాలు తాగి ఆగకుండా లోపల రక్తం కూడా తాగేస్తే అది చచ్చిపోయింది. కంసుడు ప్రోత్సహిస్తే కృష్ణుడిని చంపటానికి వచ్చింది కాని పూతనకి తనంతట తనకు పుట్టిన బుద్ధి కాదు. కృష్ణుడు పూతనని చంపేశాడని లోకం అనుకుంటారు కానీ, ఆ జీవుడు పునర్జన్మలలోకి వెళ్లకుండా, మళ్లీ ప్రకృతిలోకి వెళ్లకుండా పూతనకి మోక్షం ప్రసాదించాడు. వాడు భగవంతుడు!

అక్కడినుంచి వరుసగా చాలామంది రాక్షసులు వస్తారు, కృష్ణుడు వాళ్ళందరినీ చంపేశాడు. వీడు బాలుడే అనుకుంటారు కాని మహావిష్ణువు, నారాయణుడు అని వాళ్లకి తెలియదు. కృష్ణుడు ప్రేమస్వరూపుడు. ఎవరైనా కంసుడి ఆజ్ఞ వల్ల తనని చంపటానికి వచ్చినా, వాళ్లు మంచివాళ్ళు అనుకుంటే చంపేసి మోక్షం ఇస్తాడు. అక్కడ హృదయం ముఖ్యం ఆయనకి. మనని చంపటానికి వచ్చిన వాళ్ళకి మోక్షం ఇవ్వటం ఏమిటని అనుకోడు.

వాళ్ళని సమాజం కోసం చంపి వాళ్లకి మోక్షం ప్రసాదించేవాడు. అంతేకానీ అక్కడ వ్యక్తిగతమైన వైరాలు లేవు.

కృష్ణుడు వెన్నపూస, మట్టి కూడా తింటాడు. ఒకసారి మట్టి తింటున్నాడు. వాళ్ల అమ్మ కొట్టటానికి వచ్చేసరికి భయంవేసినట్టు ఏడుస్తూ నోరు తెరిచాడు, ఆ నోట్లో తల్లి 14 లోకాలు చూసింది. కృష్ణుడిని వెన్నదొంగ అంటారు. అందరి ఇంటికీ వెళ్లి వెన్నపూస, పాలు దొంగిలించేవాడు. వెన్నపూస తింటాడని, ఆయనకి వెన్నపూస నైవేద్యం పెడతారు. దాని అర్థం ఏమిటంటే, వెన్నపూస ఎంత మృదువుగా ఉంటుందో, అంత దయతోటి, జ్ఞానంతోటి, ప్రేమతోటి మీ హృదయం నిండి ఉంటే, మీ మనసుని ఆయన దొంగతనం చేస్తాడు. మీ మనసుని మీరు చంపుకోలేరు, మీకు తెలియకుండా మీ మనసుని దొంగిలించి, ఆత్మజ్ఞానం కలుగచేస్తాడు. అయితే అందరి మనస్సులూ తీసుకోడు. వెన్నపూస ఎంత మృదువుగా, సున్నితంగా ఉంటుందో ఎంత తెల్లగా, స్వచ్ఛముగా ఉంటుందో అలా ఎవరి మనస్సైతే అంత స్వచ్ఛముగా, ఎక్కడా కల్మషం లేకుండా, ఉంటుందో, లోతైన కరుణతో ఎవరి హృదయం అయితే నిండి ఉందో, వాళ్ల మనస్సులని దొంగిలిస్తాడు. మీ తెలివితేటలతోనే సాధన చేసి మోక్షం పొందలేరు. భగవంతుడు మీ మనసుని, మీకున్న వికారాలని తినేస్తే, మీకు మోక్షం కలుగుతుంది.

గోకులాన్ని రేపల్లె అని కూడా అంటారు. గోకులంలో ఉండగా ఆవులని కాశాడు. గోకులంలో ఉండగానే గోవర్ధనపర్వతం ఎత్తాడు. కంసుడు పంపిన రాక్షసులనందరినీ సంహారం చేశాడు. కొంతమందిని శాపవిముక్తులని చేశాడు. తరువాత గోకులం నుంచి బృందావనం వెళ్లాడు. బృందావనంలో ఉండగా చాలా లీలలు చేశాడు కృష్ణుడు. రాసలీలలు అన్నీ కూడా బృందావనంలో చూపించాడు. కాళీయసర్పం యమునానదిలో నీరంతా విషం చేసేస్తోంది అని దానిని బాధించి, దాని నెత్తిమీద నాట్యం చేసి మధించాడు. కాళీయ సర్పాన్ని ఎలా అణిచేశాడో, అలా మన అహంకారాన్ని అణిచేస్తాడు. పునర్జన్మలకి కారణం అహంకారం, మమకారం, ఆసక్తి. ఆసక్తి వల్లే మనకి టెన్షన్ వస్తుంది కదా! కృష్ణ భక్తులు

నిరంతరం కృష్ణ నామాన్ని స్మరించుకోవటం, కృష్ణ రూపాన్ని ధ్యానం చేసుకోవటం వల్ల, పొగరుగల కాళీయ సర్పాన్ని ఎలా అణిచేశాడో, అలా భక్తుల యొక్క అహంకారం మమకారం అణిచేస్తాడని దానికి ఉదాహరణగా చెపుతారు.

బ్రహ్మదేవుడు చాలా పరీక్షలు పెట్టాడు. ఒకసారి ఆయన గోపబాలురని, వాళ్ల గోవులని మాయం చేసేసాడు. ఇక్కడ అద్భుతమైన మహిమలు చేశాడు కృష్ణుడు. వాళ్లని విడిచిపెట్టమని బ్రహ్మదేవుడిని అడగలేదు. మొత్తం ఎంతమంది గోపబాలురు ఉన్నారో, ఎన్ని ఆవులు ఉన్నాయో ఆ రూపాలు అన్నీ ఈయనే ధరించాడు. బ్రహ్మదేవుడు తీసుకెళ్లిపోయిన గోవులు, గొల్లపిల్లలు అంతమందీ ఈయనే అయిపోయాడు. ఎవరింటికి వాళ్లు వెళ్లిపోయారు. ఇంట్లో వాళ్ళు వీళ్ళు మన పిల్లలే, ఇవి మన ఆవులే అనుకొంటున్నారు. తేడా ఏమీ లేదు. కొద్దిరోజులు చూశాక బ్రహ్మదేవుడికి సిగ్గు వేసింది, ఆ బాలులని ఆవులని వదిలేశాడు. ఒకసారి గోపబాలులు అడివిలో గోవులని మేపుతుంటే బ్రహ్మదేవుడు అడివి అంతా ఒక అగ్ని పుట్టించాడు. అడివి నిప్పు మనం ఆర్పలేము. గాలి ఉంటే ఇంకా ప్రమాదం. దానంతట అది ఎప్పుడో ఆరిపోయాలి. ఆ నిప్పు చూసి పిల్లలు ఆవులు పారిపోతున్నారు. నిప్పుని దగ్గరికి రానిచ్చి మొత్తం నిప్పు అంతా మింగేశాడు కృష్ణుడు, ఇటువంటివి గోకులంలో తరువాత బృందావనంలో కొన్ని వందల మహిమలు చేశాడు.

బలరామకృష్ణులు బృదావనంలో ఉన్నారని అక్కడికి అక్రూరుడుని కంసుడు రాయబారిగా పంపారు. అక్రూరుడు చాలా బుద్ధిమంతుడు. కంసుడు చంపుతాడు అని అక్రూరుడికి తెలుసు. కొంతమంది ఎంత బుద్ధిమంతులైనా కూడా వాళ్ల రాత బాగోకపోతే, పరిస్థితుల ప్రభావం వల్ల చెడ్డపనులు చేయవలసి వస్తుంది. కంసుడు కూడా తెలివైన వాడు. అక్రూరుడు స్వామివారి భక్తుడు. వాడు వెళ్తే కృష్ణుడు వస్తాడని అతడిని పంపాడు. అక్రూరుడితో వెళ్ళటానికి కృష్ణుడు రెడీగా ఉన్నాడు. అప్పుడు గోపికలు కృష్ణుడిని మథుర తీసుకెళ్లటానికి తీసుకొచ్చిన రథాన్ని పట్టుకొని వెళ్లనివ్వరు. నీ తల్లితండ్రులు నీకు అక్రూరుడు అని పేరు పెట్టారు, అక్రూరుడు అంటే క్రూరత్వం లేనివాడని, కానీ నువ్వు అన్నీ క్రూరత్వంతో

కూడిన పనులు చేస్తున్నావు, కృష్ణుడిని బలవంతంగా మధుర తీసుకొనిపోతున్నావు, అని గోపికలు అక్రూరుడిని తిడతారు. గోపికలది ఇంద్రియాలతోటి, శరీరంతోటి మనస్సుతోటి అనుబంధం లేని ప్రేమ. గోపికలకి భగవంతుడి మీద ఉన్న ప్రేమ ఉద్ధవుడికి కూడా లేదు.

కృష్ణుడు మధురలో ప్రవేశించినప్పుడు ఒక గూని అమ్మాయి కంసుడికి ఇస్త్రీ బట్టలు పట్టుకెళ్తోంది. ఆ బట్టలు అడిగాడు కృష్ణుడు. కంసమహారాజు బట్టలు ఇవి, నీలాంటి గొల్లవాడికి ఇవ్వమంటావా అని తిడుతుంది. దాని దగ్గర ఆ బట్టలు బలవంతంగా లాగేసి, రెండు లెంపకాయలు వేసి, రెండు చేతులు పట్టుకొని పైకి లాగేస్తాడు, గూనితనం పోయి అది అందమైనది అయిపోయింది. అటువంటి పనులు కృష్ణుడు చాలా చేస్తాడు. పైకి హింస కింద మీకు కనిపించినా ఆ గూనిదానిని అందగత్తెగా చేసేశాడు.


బలరామకృష్ణులు ఇద్దరూ చాలా బలవంతులు. వీళ్లు కంసుడి దగ్గరికి వెళ్లకముందే వాళ్లని చంపటానికి చాలామంది బలవంతులని, గుర్రాలని, ఏనుగులని, రాక్షసులని పంపాడు కంసమహారాజు. ఆశ్చర్యం ఏమిటంటే, కృష్ణుడు ఎవరినైనా చంపాలి అనుకుంటే, యుద్ధాలు చెయ్యక్కరలేదు, చేతిలో బాణం అక్కరలేదు, లెంపకాయ కొట్టక్కరలేదు, ఇలా ముట్టుకుంటే చచ్చిపోతారు. చూసేవాళ్లకి ముట్టుకుంటే చచ్చిపోయారేమిటి అనిపించవచ్చు. ఆ చచ్చిపోయే వాడికి మట్టుకు పెద్ద బండరాయి నెత్తిమెద పడితే ఎలా ఉంటుందో, చంపాలని సంకల్పించి మీద చెయ్యి వేసినప్పుడు, అలా ముట్టుకుంటే వెంటనే చచ్చిపోతారు. కంసుడికి కృష్ణుడికి మధ్య రాముడు రావణుడిలా యుద్ధం జరగలేదు, సింహాసనం మీద కూర్చున్న కంసుడు దగ్గరికి వెళ్లి, ఊరికే జుట్టు పట్టుకొని లాగాడు. వాడు చచ్చిపోయాడు. కంసుడు యుద్ధం చేయటంవల్ల చచ్చిపోలేదు, భయం వల్ల చచ్చిపోయాడు. చాలామంది భయం వల్ల చచ్చిపోతారు.

జరాసంధుడు పెట్టే బాధలు ప్రజలు పడలేకపోతున్నారని ద్వారక నగరం నిర్మించాడు. భగవంతుడు కూడా చట్టాన్ని గౌరవిస్తాడు. జరాసంధుడు తరుముకొస్తే కృష్ణుడు పారిపోయే వాడు. కృష్ణుడు దేవుడు అంటారు, ఇలా పారిపోతున్నాడు ఏమిటి అనుకుంటారు. కాని జరాసంధుడి మరణం కృష్ణుడి చేతిలో లేదు, భీముడి చేతిలో ఉంది.

కృష్ణుడి మాట మధురం, వదనం మధురం, నడక మధురం. ఆయన చేష్టలు అన్నీ మధురంగానే ఉంటాయి. ఆయన లీలలు ప్రత్యేకంగా ఉంటాయి. చాలా విషయాలు మనకి అందవు. ఆయన అక్కడక్కడా అధర్మాన్ని ఆచరించినట్టు మనకి అనిపిస్తుంది. కానీ ఇందులో ఒక రహస్యం ఉంది. ఆయన అధర్మాన్ని ఆచరించినా, ధర్మాన్ని స్థాపించటానికే చేశాడు. కృష్ణుడు అబద్ధం చెప్పాడేమిటి అని మనకి అనిపిస్తుంది కాని అబద్ధం చెప్పటం కోసం చెప్పటం కాదు, అక్కడ పరిస్థితులని బట్టి అబద్ధాన్ని కూడా ధర్మాన్ని స్థిరపరచటానికి ఉపయోగపడేలాగ చెప్పాడు. ఆ రహస్యం గ్రహించినవాళ్ళు అదృష్టవంతులు.

భగవద్గీతలో విభూతియోగంలో పాండవులలో అర్జునుడుని నేను, మునులలో వేదవ్యాసుడిని నేను అన్నాడు. అంటే విన్నవాడూ ఆయనే, చెప్పినవాడూ ఆయనే, రాసినవాడూ ఆయనే. అన్నీ ఆయనే. ఆయనకు కానిదంటూ ఏమీ లేదు. ఈలోకంలో జరిగే ప్రతి సంఘటన కూడా ఈశ్వరుని లీల, కృష్ణుడి లీల.

భగవంతుడి యొక్క లీలలు ఎలా ఉంటాయో మనకి తెలియదు. కృష్ణుడు యొక్క దయ, నారాయణుడి దయ మీకు ఉంటే, ఎన్ని కష్టాలు వచ్చి మీద పడినా, ఈ కష్టాలని అవకాశంగా తీసుకుని ఆ కష్టాన్ని సుఖంగా అప్పటికప్పుడు మార్పు చేసేయగలడు, మీ దురదృష్టాన్ని అంతా సుఖంగా మార్చేయగలడు. వాడు కృష్ణుడు!



**కృష్ణుడు స్థితప్రజ్ఞుడు. ఎవరు ఏమనుకున్నా ఆయనకి ఏమీ అనిపించదు. మీరు చెడ్డవాడు అనుకున్నా మంచి వాడు అనుకున్నా, పుణ్యాత్ముడు అనుకున్నా పాపాత్ముడు అనుకున్నా, వెన్నపూస దొంగ అనుకున్నా, వాడి మనస్సు చలించదు, వాడు స్థితప్రజ్ఞుడు.**

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 11 మార్చి 1996, ఖండవల్లి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

భగవాన్ ఏమంటున్నారు అంటే నీ లోపల ఉన్నటువంటి సత్య వస్తువుని తెలుసుకున్నాక నీకు అంతా ఆనందమే. God is bliss అనడం లేదు, దేవుడిలో ఆనందం ఉంది అనడం లేదు. లేకపోతే ఆత్మ is bliss అనడం లేదు. ఏమంటున్నారు? All is bliss. అంటే అంతా ఆనందమే. ప్రపంచాన్ని కూడా వాడు ఆనందంగా అనుభవిస్తాడు. ఒక్క దేవుడినే కాదు, ప్రపంచాన్ని కూడా వాడు ఆనందంగానే అనుభవిస్తాడు, All is bliss. నువ్వు ప్రపంచంలో ఉన్నావు అనుకో, నీ దేహానికి ఇంకా చావు రాలేదు అనుకో, బ్రతికి ఉండగా మీకు సడన్‌గా జ్ఞానం వచ్చేసింది అనుకోండి, అప్పుడు కూడా మీకు ప్రపంచం కనిపిస్తుంది కదా, ప్రపంచాన్ని కూడా మీరు ఆనందంగానే అనుభవిస్తారు. అది మిమ్మల్ని ఏమి చిరాకు పెట్టదు, మీకు ఏమి trouble ఇవ్వదు, మీకేమి disappointment తీసుకురాదు. దేవుడు సరేసరి, నీ హృదయాన్ని సరేసరి, ప్రపంచాన్ని కూడా, ఈ సృష్టిని కూడా నువ్వు ఆనందంగానే అనుభవిస్తావు. దేవుడే ఆనందం అనుకోకు, ప్రపంచం కూడా నీకు ఆనందమే. ఎప్పుడు? ఆ realization నీకు కలిగాక. God is bliss, World is bliss, self is bliss, All is bliss. నోటితోటి ఎంతవరకు చెప్పగలడో అంతవరకు తీసుకుని పోతున్నాడు. God is bliss అదే కాదు World is bliss, All is bliss, అంతా ఆనందమే. నీకు జ్ఞానం వచ్చేసినా శరీరం ఎక్కడకు పోతుంది? ప్రపంచం ఎక్కడకు పోతుంది? శరీరం ఉంటుంది, ప్రపంచం ఉంటుంది. అంతా bliss ఇక మీకు. World కూడా మీకు World లాగా కనపడదు, Bliss గానే మీరు దానిని అనుభవిస్తూ ఉంటారు, World is bliss.

నాకు పునర్జన్మ రాకుండా ఎలా తప్పించుకోవాలి అని అడుగుతున్నాడు. అంతా bliss అనుకో, అంతా నీకు ఆనందం కనిపిస్తుంది అనుకో, అప్పుడు పునర్జన్మ రాకుండా ఎలా ఆపుచేసుకోవాలి అనేవాడు ఇంక కనపడనే కనపడడు, ఇంక వాడి గొడవ నీకు ఉండదు అంటున్నారు. ఎవడైతే పునర్జన్మ నుండి తప్పించుకోవాలి అనుకుంటున్నాడో వాడు పత్తా లేకుండా పోతాడు. వాడు కాలిపోయి బూడిద అవుతాడు. వాడే బూడిద

అయినప్పుడు, పునర్జన్మ గురించి ఆలోచించేవాడు లేనప్పుడు ఇంక పునర్జన్మ గురించి ఆలోచన లేదు. విషయచింతన చేసేవాడు ఉన్నప్పుడు విషయచింతన ఉంటుంది కానీ చేసేవాడు లేనప్పుడు విషయచింతన ఉండదు. All is bliss అయినప్పుడు వాడికి ప్రారబ్ధం లేదు, సంచితం లేదు, ఆగామి లేదు. సంచితం, ప్రారబ్ధం, ఆగామి ఎవరికి? కర్తృత్వం ఉన్న వాడికి. మనకి గాఢనిద్రలో కర్తృత్వం లేదు, మెలకువలో కర్తృత్వం వస్తుంది. కర్తృత్వం కల్పించేది ఎవరు? మైండ్. జాగ్రత్తగా అర్థం చేసుకోండి సబ్జెక్టు. కంగారు పడిపోకుండా క్లోజ్‌గా రండి. గాఢనిద్రలో మనకి కర్తృత్వం లేదు, మెలకువలో కర్తృత్వం వస్తుంది. గాఢనిద్రలో మైండ్ లేదు, మెలకువలో మైండ్ వస్తుంది కాబట్టి ఆ మైండ్ నీకు కర్తృత్వం కల్పిస్తుంది కాని అది నిజంగా లేదు. కర్తృత్వం నశించినప్పుడు ప్రారబ్ధం గురించి, సంచితం గురించి, ఆగామి గురించి ఆలోచించేవాడు లేడు.

ఆగామి అంటే దాళ్వా పంట, సంచితం అంటే గాదెలో ఉన్న వడ్లు, ప్రారబ్ధం అంటే డబ్బాలో ఉన్న బియ్యం. ఈ దాళ్వా పంట గాదెలోకి వెళ్తుంది. ఆగాదెలోకి వెళ్ళింది మళ్ళీ మనకి బియ్యం కింద వస్తుంది. ఇక్కడ భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే మీ ఇంట్లో డబ్బాలో కొన్ని బియ్యం ఉంటాయి. ఆ బియ్యం ఇప్పుడు మీరు తింటూ ఉంటారు, అది ప్రారబ్ధం. కొన్ని వడ్లు గాదెలో ఉంటాయి, అంటే డబ్బాలోని బియ్యం అయితేనే కానీ అవి మీరు తీసుకోరు. ఆగాదెలో ఉన్నవి సంచితం. తర్వాత ఇంకొక నెలరోజులకి దాళ్వావడ్లు వస్తాయి, అవి ఆగామి. భగవాన్ ఏమి చెప్పారు అంటే మనస్సు ఎప్పుడైతే నశించిందో వాడికి సంచితం లేదు, ఆగామి లేదు, ప్రారబ్ధం లేదు. అక్కడ భగవాన్‌ను తరువాత చెబుదురుగాని ఒక నిమిషం ఆగమన్నాడు ప్రశ్నించేవాడు. భగవాన్‌కు కేన్సర్ వచ్చింది కదా, ఈ కేన్సర్ ఇంట్లో డబ్బాలో ఉన్న బియ్యం లాంటిది. ఎప్పుడైతే కర్తృత్వం నశించిందో ప్రారబ్ధం కూడా నశిస్తుంది అంటున్నారు. ఇప్పుడు పురుగు పట్టి పంటపాడై దాళ్వావడ్లు పోతాయి కానీ ఇంట్లో ఉన్న బియ్యం ఎక్కడకు పోతాయి అంటున్నాడు ఈ ప్రశ్నించేవాడు.

మీ దేహానికి కురుపు వేసింది, కురుపు మా కళ్లకి కనిపిస్తోంది. దానికి సంబంధించిన బాధ కూడా మీకు తెలుస్తుంది. మరి ఇది ప్రారబ్ధం కాకపోతే ఇంకేమిటి? మీరు ప్రారబ్ధం అనుభవించకపోతే మీ శరీరానికి కురుపు ఎందుకు వచ్చింది అన్నాడు. అంటే బ్రహ్మానుభవం

కలిగిన వాడికి కూడా, సంచితం నశిస్తుంది, ఆగామి నశిస్తుంది, కానీ ప్రారబ్ధం నశించదా అని ప్రశించేవాడు అడుగుతున్నాడు. భగవాన్ ఏమంటున్నారు అంటే ప్రారబ్ధం కూడా నశిస్తుంది అంటున్నారు. మరి మీ మాట ఏమిటి? మీ దేహానికి కురుపు వేసింది కదా, మీరు బాధ పడుతున్నారు కదా దాని మాట ఏమిటి అన్నాడు. అప్పుడు భగవాన్ ఏమన్నారు అంటే రమణమహర్షిగారి దేహానికి కురుపు వేసింది, ఆయన బాధపడుతున్నారు అని చూసేవాడికి అనిపిస్తుంది కాని బాధపడుతున్నాను అనుకునేవాడు ఇక్కడ లేడు. రమణమహర్షి గారికి కురుపు వేసింది బాధ పడిపోతున్నారు అని చూసేవాడికి ప్రారబ్ధం కనిపిస్తుంది. కానీ ప్రారబ్ధం అనుభవిస్తున్నాను అనుకునేవాడు ఇక్కడ లేడు అందుచేత వాడికి కూడా ప్రారబ్ధం లేదు. చూసేవాడి కళ్లకి కనిపిస్తుంది కానీ ప్రారబ్ధం అనుభవిస్తున్నాను అనుకునేవాడు అక్కడ లేడు కాబట్టి ప్రారబ్ధం వాడికి లేదు. అందుచేత ప్రారబ్ధం కూడా జ్ఞానికి లేనేలేదు. చూసేవాడికి ప్రారబ్ధం అనుభవిస్తున్నాడు అని అనిపిస్తుంది.

ఎవడి దేహప్రారబ్ధాన్ని బట్టి వాడికి రోజులు వెళ్ళిపోతూ ఉంటాయి, ఇదంతా స్వప్న సమానం. నువ్వు పొందవలసిన గమ్యాన్ని మటుకు మర్చిపోకు. నీ దృష్టి లోంచి దానిని విడిచిపెట్టకు. గమ్యం కనుక నీ దృష్టిలో పెట్టుకుంటే నీకు కష్టం కష్టం కింద కనిపించదు. దేహప్రారబ్ధం ప్రకారం ఏదో ఒక గొడవ వస్తూ ఉంటుంది. కానీ మీరు సాధన చేసేటప్పుడు గమ్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ఆ గమ్యాన్ని కనుక దృష్టిలో పెట్టుకుంటే మీ సాధన కూడా మీకు కష్టంగా కనిపించదు. మీ సంసారంలో వచ్చిన కష్టం కూడా మీకు కష్టం కింద కనిపించదు. ఎప్పుడు? మీరు పొందవలసిన గమ్యాన్ని కనుక మీరు దృష్టిలో పెట్టుకుంటే! అందుచేత మీరు పొందవలసిన వస్తువు మీద మీ చూపు ఉంచండి.

కొంతమందికి దేహం అదృశ్యం అయ్యిపోతుంది కదా, దాని గురించి మీ అభిప్రాయం



**"నాకు ఎవరిమీద అయితే దయ ఉందో వాళ్లకి డబ్బు లేకుండా చేస్తాను. ఎందుచేతనంటే ఈ డబ్బు ఉన్నవాళ్లు లెక్క పెట్టుకోవటంతోటి సరిపోతుంది. డబ్బు లేకుండా చేయటం వాళ్ళ మీద ఇష్టం లేక కాదు, వాళ్ల మనసుని నావైపు తిప్పుకోవటం కోసం" అన్నాడు కృష్ణుడు.**

ఏమిటి అని భగవాన్‌ని అడుగుతున్నాడు. దానిని చాలా సింపుల్‌గా తీసి అవతల పడేస్తున్నారు, భగవాన్ ఏమంటున్నారు అంటే దేహం ఎంత నిజమో ఈ గొడవలు కూడా అంతే నిజం. These all are not spiritual matters; These all are physical matters. భగవంతుడు మీ శరీరాన్ని ఐక్యం చేసేసుకోనివ్వండి కానీ అది ముఖ్యం కాదు, ఇక్కడ నువ్వు మోక్షస్థితిని పొందావా లేదా అన్నది ముఖ్యం కానీ, నీ దేహాన్ని స్మశానంలో కాల్చారా? లేకపోతే అది దేవుడిలో ఐక్యం అయిపోయిందా? అది ముఖ్యం కాదు. పొందవలసిన స్టేట్ నువ్వు పొందావా? లేదా అనేది ముఖ్యం. ఎక్కడకు తీసుకుపోతున్నాడో చూడండి, మాములుగా మర్యాదగానే మాట్లాడతారు భగవాన్, మీరు భోజనం చేస్తారా, లేకపోతే కాఫీ తాగుతారా ఇటువంటివి బాగానే అడుగుతారు. కానీ సబ్జెక్టు దగ్గరకి వచ్చేటప్పటికి ఇంక రాజీపడే సమస్య లేదు. నీ వినోదం కోసం, నీ సంతోషం కోసం, అబద్ధాలు చెప్పవలసిన అవసరం నాకు లేదు అన్నారు ఆయన. ఇదేమి సినిమా కాదు. సినిమాలో entertainment కోసం డాన్సులు అవి పెడతారు. ఆ డాన్సులు లేకపోతే డబ్బులు రావు. ఇదేమి సినిమా కాదు కదా, నీ సరదా కోసం అసత్యం చెప్పవలసిన పని నాకేమి ఉంది? నీ దేహాన్ని నువ్వు అదృశ్యం చేసుకున్నా ఒక్కటే, లేకపోతే అది స్మశానంలో కాల్చబడినా ఒక్కటే, అసలు నువ్వు పొందవలసిన స్టేట్ నువ్వు పొందావా లేదా అన్నది ముఖ్యం కానీ నీ దేహం ఏమైంది అన్నది ముఖ్యం కాదు. These all are physical matters.

వాళ్ళ ఆచారాలను బట్టి కొన్ని శరీరాలను తీసుకెళ్ళి స్మశానంలో కప్పెడతారు. కొన్ని శరీరాలను తీసుకెళ్ళి స్మశానంలో కాలుస్తారు. వాళ్ళు కప్పెట్టారా? వాళ్ళు కాల్చారా? అన్నది ముఖ్యం కాదు, నువ్వు పొందవలసినది పొందావా లేదా అది ముఖ్యం. కప్పెడితే మట్టి అవుతుంది, కాలిస్తే బూడిద అవుతుంది. ఆ గొడవ నీకెందుకు? నువ్వు కానిదాని గొడవ నీకు ఎందుకు? నీ సాధన యొక్క గమ్యం దేహాన్ని మాయం చేసుకోవడమా? నువ్వు మోక్షాన్ని పొందడమా? నువ్వు మోక్షం పొందావు అనుకో, నీ దేహం మాయం అవ్వదు అనుకో నీకు నష్టం ఏమిటి? ఇంకొక నాలుగువందల రూపాయల ఖర్చుపెట్టి దేహాన్ని కాల్చేస్తున్నారు కదా, నువ్వు ఇంతా సాధన చేసి నీ దేహాన్ని మాయం చేసుకుంటావా? ఒక్క నాలుగువందల రూపాయల విలువా నువ్వు చేసే సాధన? ఇందుకా నువ్వు బ్రతికేది? నీ తరువాత నాలుగువందలు ఖర్చుపెట్టి నీ దేహాన్ని తగులబెట్టలేరా? ఆమాత్రం కూడా

పనిచెయ్యలేరా? నాలుగువందలు ఖర్చు పెట్టి నీ దేహాన్ని తగులబెట్టే అంత శక్తి లేనివాళ్ళా నీ వాళ్ళు? నువ్వు జీవితం పొడవునా సాధనచేసి దేహాన్ని మాయం చేసుకోవడం నీ లక్ష్యమా? అదే నీ ఎయిమా? అదే నీ గోలా? అదే నీ డెస్టినేషనా?

ఈ physical matters, ఈ మహిమలు నా దగ్గర చెప్పకండి. నువ్వు పొందవలసినది ఏదో దానిని చూసుకో, శరీరం అదృశ్యం అయితే అదృశ్యం అవుతుంది, శవం అయితే శవం అవుతుంది. అదృశ్యం అయితే గొడవ లేదు, పోనీ శవం అయితే కాలుస్తారు, నీకు నష్టం ఏమిటి? నువ్వు పొందవలసినది పొందావో లేదో అది చూసుకో, అంతేకానీ నీ శరీరం మాయం అయ్యిందో, అవ్వలేదో అది నీ గమ్యం కాదు. నీ గమ్యం ఏమిటో స్పష్టపరచుకో, ఆ గమ్యానికి సంబంధించిన confusion నీకు ఉండకూడదు, దానికి సంబంధించిన క్లారిటీ నీకు ఉండాలి. క్లారిటీ లేకపోతే దానిని నువ్వు పొందలేవు. నువ్వు ఆత్మవి కాదా? దేనికైతే చావులేదో ఆ వస్తువు నువ్వు కాదా? అదే నువ్వైతే why trouble about other matters. ఈ శరీరం ఏమైతే ఆ గొడవ నీకు ఎందుకు? నువ్వే కనుక ఆత్మవి అయితే శరీరం గొడవ నీకు ఎందుకు? నువ్వు కానిదాని గురించి ఆలోచిస్తావు ఎందుకు? నువ్వు కానిదాని గురించి Trouble తెచ్చుకుంటావు ఎందుకు? కొంతమంది నేను చనిపోతే ఈ ప్రపంచం ఏమైపోతుంది అనుకొంటారు. కొంతమంది ముసలివారు నేను చనిపోతే ఈ సంసారం ఏమైపోతుంది అనుకొంటారు. ఏమి అవ్వదు, అంతా బాగానే ఉంటుంది, అది తెలియక వాళ్ళు కంగారుపడతారు. మీకు అర్థమవుతోందా? నువ్వు కాని దాని గొడవ నీకు ఎందుకు? ఇప్పుడు మనం ఖండవల్లిలో ఉ న్నాము. ఇది తణుకు, ఇది తణుకు అనుకుంటావు అనుకో అది తణుకు అవుతుందా? అవ్వదు. నువ్వు కాని దానిని అవును, అవును అనుకొన్నా అలా నువ్వు ఎంత జపం చేసినా అది అవ్వదు. అసలు నువ్వు కానివిషయాలు గురించి నిన్ను ఎవరు ఆలోచించమన్నారు? ఆ దుమ్మంతా తెచ్చి నీ ముఖానికి ఎవరు రాసుకోమన్నారు? చెరుకుగడ నీ చేతిలో ఉందనుకో, రసం అంతా బయట పడేసి, తుక్కు అంతా జేబులో వేసుకుని తిరుగుతావా? భగవాన్ ఏమంటున్నారు అంటే చెరుకుగడ నీ దగ్గర ఉందనుకో, నువ్వు ఏమి చెయ్యాలి?ఆ రసాన్ని తీసుకోవాలి, పిప్పి బయట పడేయాలి. రసాన్ని బయట గుమ్మరించి పిప్పి భుజాన వేసుకుని తిరుగుతావా? ఇదా నువ్వు చేసే పని? ఏదైతే ముఖ్యమో ఆ Essenceని వదిలేసి Essence

కానిదానిని పట్టుకుని ఊరేగుతావా?

భగవాన్ ఏమి అంటున్నారు అంటే catch the essence, why trouble about other matters? బ్రహ్మానుభవం కలగడానికి ఉపయోగం లేని మాటలు ఎవరు చెప్పినా, ఆ మాటలు తీసి ఒక పక్కన పెట్టండి. ఇప్పుడు మనం గది తుడుచుకుంటాం. అందులో ఎర్రచీమలు ఎన్ని ఉన్నాయి, ఖండచీమలు ఎన్ని ఉన్నాయి, చీపురుపుల్లలు ఎన్ని ఉన్నాయి అని చూడము. ఆ తుక్కు అంతా తీసుకెళ్ళి పెంట మీద పడేస్తాము. నేనేదో కొన్ని విషయాలు మీకు చెప్పాను అనుకోండి, ఇందులో essence ఉంటే మీరు తీసుకోండి, అంటే బ్రహ్మానుభవం కలగడానికి ఉపయోగపడే మాటలు ఉంటే మీరు తీసుకోండి. బ్రహ్మానుభవం కలగడానికి ఉపయోగం లేని మాటలు కూడా నేను చెప్పాను అనుకోండి, వాటిని తీసి ఒక పక్కన పెట్టండి. అంటే మీరు అరటిపండు తిన్న తరువాత తొక్కలు ఏమి చేస్తారు? పక్కన పడేస్తారు. అలాగే నేను చెప్పిన మాటల్లో మంచిమాటలు, బ్రహ్మానుభవం కలగడానికి ఉపయోగపడే మాటలు తీసుకోండి, మిగతా మాటలని తొక్కలు అవతల పడేసినట్టు అవతల పడేయండి. మీకు పనికొచ్చేది ఏమిటో తీసుకుని, పనికిరానిది విడిచిపెట్టండి, Take the essence.

నువ్వు బ్రహ్మానుభవం పొందడానికి ప్రయత్నం చెయ్యి, ఆ ప్రయత్నంలో నువ్వు success అవ్వు, లేకపోతే ఆ ప్రయత్నంలో నువ్వు మరణించు. To be or not to be that is the question. ఉండటమో, ఊడిపోవటమో ఏదో ఒకటి తేలిపోవాలి. నువ్వు బ్రహ్మానుభవం కనుక పొందితే There is no birth, no Trouble, no unhappiness. అసలు Trouble లేదు, unhappiness లేదు, difficulties లేవు, disappointments లేవు. ఏమి లేదు అన్న సంగతి నీకు తెలుస్తుంది. ఇదంతా స్వప్నం అన్న సంగతి నీకు అనుభవంలోకి వస్తుంది. ఇదివరకు మేము చాలా కష్టపడిపోయాం అనుకుంటున్నారు అనుకోండి, ఇప్పుడు మీకు ఆ అనుభవం వచ్చేసింది అనుకోండి, ఇదివరకు ఉన్న కష్టం అంతా కల కింద మీకు తెలుస్తూ ఉంటుంది. అయ్యో నేను ఎంతో కష్టపడిపోయాను అని అనుకున్నాను ఇంతకాలం అసలు కష్టపడింది ఏమి లేదు అన్న సంగతి తెలుస్తుంది. నువ్వు పడ్డ కష్టం నీకే తెలియదు. ఎప్పుడు? నీకు బ్రహ్మానుభవం కలిగాక. ఎందుచేత అంటే నేను కష్టపడుతున్నాను అనుకొనేవాడికి చావు వచ్చేస్తుంది. అది అంతా స్వప్నంతోటి సమానం అన్న సంగతి నీకు తెలుస్తూ ఉంటుంది.



# శ్రీమద్భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

**మయి చానన్యయోగేన భక్తి రవ్యభిచారిణీ ।**

**వివిక్త దేశసేవిత్వమ్ అరతిర్జన సంసది ॥ 13-10 ॥**

**తాత్పర్యము :** పరమేశ్వరుడనైన నాయందు అనన్యయోగము ద్వారా అవ్యభిచారిణీ భక్తి కలిగియుండుట, ఏకాంత పవిత్ర ప్రదేశమున వసించు ప్రవృత్తి కలిగియుండుట, విషయాసక్తులైన జనులయెడ ఆసక్తి లేకుండుట.

**మయి చానన్యయోగేన భక్తి రవ్యభిచారిణీ -** భక్తి మంచిదే కానీ వ్యభిచారభక్తి పనికిరాదు అంటున్నాడు భగవంతుడు. వ్యభిచారభక్తి అంటే చాపల్యంతో కూడిన భక్తి. రమణమహర్షిగారికి అరుణాచలేశ్వరుడి మీద ఉన్న భక్తి అవ్యభిచారభక్తి. అరుణాచలం వచ్చిన తరువాత, 54 సంవత్సరాలలో ఈ అరుణాచలం వదిలి ఎక్కడికైనా వెళ్ళాలి అనే తలంపు కూడా ఆయనకు

రాలేదు. అంటే తలంపు వచ్చాక కంట్రోల్ చేసుకోవడం కాదు. ఆ తలంపు అరైజ్ కాలేదు. అది అవ్యభిచారభక్తి. శరీరంలో ప్రాణం పోయే టైములో కూడా అరుణాచలం అనే శబ్దం చెవిలో పడిన వెంటనే కళ్లు తెరచి ఆనంద భాష్పాలు రాల్చాడు. అరుణాచలేశ్వరుడు తనకంటే వేరు కాదు అని తెలిసి ఉండి కూడా అరుణాచలేశ్వరుడి మీద ఆయనకి ఆ గౌరవం ఉంది. అరుణాచలం వచ్చిన రోజున అరుణాచలేశ్వరుడి మీద ఎంత ప్రేమ ఉందో, 54 సంవత్సరాల తరువాత కూడా అదే ప్రేమ ఉంది ఆయనకి. ఆత్మజ్ఞానం పొంది ఉండి కూడా అరుణాచలేశ్వరుడి మీద ఆయనకి అంత ప్రేమ ఉందంటే, అది అవ్యభిచారభక్తి. చపలత్వం లేని భక్తి అవ్యభిచారభక్తి.

**మయి చానన్యయోగేన –** అంటే సర్వేశ్వరుడు కంటే మించినది ఏది లేదు. నాతోటి సమానమైన వాడే ఎవడు లేడు, నన్ను మించిన వాడు ఉంటాడు అని ఎలా అనుకుంటున్నావు అన్నాడు కృష్ణుడు గీతలో. అనన్యయోగేన అంటే ఇతర తలంపులు ఏమీ లేకుండా మన గమ్యం, సాధన, మనం జీవించేది కూడా భగవంతుడి కోసమే అవ్వాలి. భక్తుడు తన అహంభావన కోసం మాట్లాడడు, భగవంతుడి వైభవాన్ని ప్రకాశంలోకి, వెలుగులోకి, తీసుకురావడం కోసం మాట్లాడతాడు. అందుచేత నన్నే గమ్యంగా పెట్టుకుని, నా కోసమే జీవిస్తూ, నా కోసమే తింటూ, నా కోసమే నడుస్తూ, నా కోసమే మాట్లాడుతూ, నాకంటే మించిన ఫలం నీకు ఏది లేదని గుర్తింపు రావాలి. నీకు జన్మ వచ్చినందుకు పొందదగిన వాడిని నేనే. నాకంటే పొందదగిన వస్తువు నీకు ఏది లేదు. నేను తప్పించి మిగతావి అంతా కూడా నీకు స్వప్న సమానం. అది నువ్వు అర్థం చేసుకుంటే అలౌకిక శాంతి అందుతుంది అర్జునా! నడిచినా, కూర్చున్నా, మాట్లాడినా, నిద్రపోయినా, మెలకువలో ఉన్నా ఏ అవస్థలో ఉన్నప్పటికీ నన్నే గమ్యంగా పెట్టుకో. భగవంతుడిని పొందడం కోసమే నువ్వు చేస్తున్న పని సహకరించాలి. అలా అనన్యభక్తి కలిగి ఉండాలి.

**వివిక్త దేశసేవిత్వమరతిర్జన సంసది** ఈ మాటలు మనకి ముఖ్యం. మన రోగాలు అన్నీ ఇక్కడ ఉన్నాయి. అరతి జన సంసది అంటే ప్రకృతి మానవులు, లౌకికులు, ప్రాపంచిక

మనుషులు చెప్పే మాటలలో రుచి అనుభవిస్తూ ఎవడైతే ఉంటాడో వాడు భక్తుడు కాదు, వాడు నన్ను చేరుకోలేడు. కొంతమంది ప్రకృతి మనుషులు ఉంటారు. ప్రకృతి గొడవలు తప్పించి పురుషోత్తముడి గొడవలు వాళ్ళు ఏమీ చెప్పరు. దేవుడి గురించి మాటలు వాళ్లకి రుచి ఉండదు. ఎంతసేపు ప్రకృతి గొడవలే చెబుతారు. పైగా వాళ్ళే ఏదో బుద్ధిమంతులు అని, ఇతరులు బుద్ధిమంతులు కాదని చెబుతూ ఉంటారు. ఇటువంటి జనం దగ్గరకి వెళ్లి కూర్చోవటం పట్ల నీకు ప్రీతి ఉంటే, నువ్వు ఆధ్యాత్మిక జీవితానికి పనికిరావు. నీకు భక్తి కలగదు. నీ మనసు భగవంతుడి వైపుకి తిరగదు.ఎంత స్పష్టంగా రోగం చూపిస్తున్నాడో చూడండి.

**వివిక్త దేశసేవిత్వం –** ఎంతసేపు ప్రాపంచిక మనుషుల దగ్గర కూర్చోవాలి అనే తలంపు కంటే, ఏకాంతంగా కూర్చుని భగవంతుడిని ధ్యానం చేసుకుందాం అనే ప్రీతి నీకు ఉండాలి. ఏకాంతం అంటే ఎవరూ లేకుండా ఒంటరిగా గదిలో కూర్చుని జపమో, ధ్యానమో చేసుకోవడం అనుకుంటాము. రమణమహర్షిగారు ఏకాంత ప్రదేశం అనేది నీ హృదయంలో ఉంది అన్నారు. నీ హృదయగుహలో నువ్వు ఉండగలిగితే నీకు ఏకాంతవాసం అంటే ఏమిటో తెలుస్తుంది,గదిలో తలుపులు వేసేసుకుంటే ఏకాంతస్థితి వచ్చేయదు. మీ హృదయంలోనే ఏకాంతస్థితి ఉంది. మీ మనస్సుని, బుద్ధిని హృదయంలో నిలబెట్టి ఉంచ గలిగితే అది ఏకాంతం అన్నారు భగవాన్.

కృష్ణుడు చెప్పిన ఏకాంతమే మనం తీసుకుందాం. రోజూ ఒక గంటసేపు ఏకాంతంగా కూర్చుంటే, మనకున్న బలహీనతలు ఏవో తెలుస్తూ ఉంటాయి. అంటే ప్రశాంతంగా మనం ఒక్కళ్ళమే కూర్చుంటే, మనకి ఏ తలంపులు అయితే ఇష్టమో, ఏ తలంపులు అయితే మనల్ని లోకంలో బంధిస్తున్నాయో ఆ తలంపులే వచ్చి కూర్చుంటాయి. వ్యవహారరీత్యా ప్రకృతి మనుషుల తోటి మనకి కొన్ని సంబంధాలు ఉంటాయి; ఆ సంబంధం అంతవరకే పెట్టుకోవాలి. అంతేకానీ వాళ్ళ దగ్గర కూర్చుంటే,నీకు సంతోషం వస్తుంటే, నువ్వు ఆధ్యాత్మిక జీవితానికి మటుకు పనికిరావు అంటున్నాడు పరమాత్మ.

## ది॥ 29-07-2026 బుధవారము నాడు **గురు పౌర్ణమి**
## సందర్భముగా సద్గురు **శ్రీ నాన్నగారి దివ్య సన్నిధి**



# సమర్పణ

భక్తులమని భావించే మనకు ముందుగా భగవంతుడు (లేదా) సద్గురువు పైన సజీవ విశ్వాసము, నమ్మకము ఉండాలి. మనము రైలు ఎక్కాలంటే రైల్వే స్టేషనుకు చేరుకునే వరకు మన ప్రయాణ సామగ్రిని తీసుకెళ్ళడానికి ఒక ఆటో లేదా ఒక కారును ఉపయోగిస్తాం. ఇవేవి లేని పక్షంలో మన సామాగ్రిని మనమే మోయవలసివస్తుంది. స్టేషనుకు చేరుకుని రైలు ఎక్కి రైలులో కూరున్న తరువాత, రైలు మన సామాగ్రితో పాటు మనలను కూడా తీసుకువెళుతుంది. రైలు ఎక్కిన తరువాత కూడా మన లగేజిని మన తలపై పెట్టుకుంటామా? అలా పెట్టుకుంటే అంతకన్నా అవివేకం ఏముంటుంది? మనలను మోసే రైలు మన సామాగ్రిని మోయలేదా? అలాగే మనము పరమాత్మకు (లేదా) సద్గురునికి శరణాగతులమై ఉండాలి. అనగా నిస్సందేహముగా, షరతులు లేకుండా ప్రతీది ఆయనకు సమర్పించాలి. అనగా మన అహంకార, మమకారాలను ఆయనకు పరిపూర్ణంగా సమర్పించాలి, అప్పుడు ఆయనే సమస్తమూ చూసుకుంటారు. ఎప్పుడు చేయాలి, ఏమి చేయాలి, ఎలాగ చేయాలి అనేది పూర్తిగా సద్గురునికే వదిలేయాలి. "ఆయన చేసేది ప్రతీది మన మంచికే" ఇది మనము ఆయనకు పరిపూర్ణమైన శరణాగతి చెందినప్పుడు మాత్రమే అనుభవైకవేద్యం అవుతుంది. ఈ సృష్టి సకలాన్ని అనాదిగా నడుపుతున్న శక్తే నన్ను కూడా నడుపుతోంది అన్న సత్యాన్ని గుర్తించాలి. ఒక్క భగవంతుడిని తప్ప, ఇంకేదీ కోరనివాడే నిజమైన భక్తుడు. మేము ఫలానా వారి భక్తులమని చెప్పుకుంటాం, కానీ ఆయన కూడా మనల్ని తమ భక్తులుగా అంగీకరించాలి కదా? మరి ఎప్పుడు అంగీకరిస్తారు? అంటే మనము పరమాత్మకు పరిపూర్ణ శరణాగతి చెంది ఆయనకు ఒక ఉపకరణంగా మారితేనే తప్ప మనకు భక్తులమని చెప్పుకునే అర్హత లభించదు. భక్తి అంటే భగవంతుడు మనకు ఏదో ఇస్తాడని ఆశపడడం కాదు, ఆయన ఇవ్వబట్టే మనము ఇలా ఉన్నామని తెలుసుకోవడం. అరిషడ్వర్గాలతో నిండియున్న మనస్సును ధర్మము, సత్యము, ప్రేమ సద్గురుని పట్ల సజీవ విశ్వాసము, భూతదయ మున్నగు సద్గుణాలతో నింపాలి. మాటలు పుణ్యపు మూటలు కావాలి, పాపపు సంచులు కాకూడదు. మాటలను దుర్వినియోగం చేయకూడదు. ప్రశాంత మనస్సును, వివేక సహితమైన బుద్ధిని సాధించాలి.

- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064